

రెస్క్యూ టీంకు ప్రథమ బహుమతి

రామగుండంలో జరిగిన జోనల్‌స్థాయి రెస్క్యూ పోటీల్లో సింగరేణి కొత్తగూడెం రీజియన్ టీమ్ మొదటి బహుమతి సాధించింది. 8లో



.. ఆగిన తల్లి గుండె

కుమారుడి మరణాన్ని తట్టుకోలేని తల్లి గుండె పోటుతో మృతిచెందిన ఘటన ఇల్లెందులో మంగళవారం తీవ్ర విషాదం నింపింది. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం
32° / 21°

జిల్లాలో బుధవారం మధ్యాహ్నం వరకు అధిక ఉష్ణోగ్రత నమోదవుతుంది. ఆ తర్వాత వాతావరణం చల్లబడి వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక మంగళవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారు జామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. మంగళవారాన్ని పురస్కరించుకుని శ్రీ అభయాంజనేయస్వామి వారికి అభిషేకం, తమలపాకులతో అర్చన గావించారు. కాగా, ఏపీలోని కోనసీమ జిల్లా పలివెల గ్రామస్తుల కోరిక మేరకు రామాలయ ప్రచార రథం ద్వారా స్వామివారి ఉత్సవ మూర్తులను తీసుకెళ్లి అక్కడ కల్యాణం నిర్వహించారు.

24న కొత్తగూడెంలో జాబ్‌మేళా

సింగరేణి(కొత్తగూడెం): జిల్లా ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యాన ఈనెల 24న కొత్తగూడెంలోని మండల పరిషత్ కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి కె.శ్రీరామ్ తెలిపారు. వివిధ ప్రైవేట్ కంపెనీల్లో 550 పోస్టుల భర్తీకి ఈ జాబ్‌మేళా నిర్వహిస్తుండగా 18 నుంచి 35 ఏళ్ల లోపు వయస్సు కలిగి ఎస్సెస్సీ మొదలు పీజీ వరకు విద్యార్హత ఉన్న అభ్యర్థులు హాజరు కావాలని సూచించారు. జాబ్‌మేళాకు వచ్చే వారు బయోడేటా విద్యార్హతల సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలు తీసుకురావాలని తెలిపారు.

డీఎఫ్‌ఓకు జాతీయస్థాయి పోటీల్లో పతకాలు

పాల్వంచరూరల్: అటవీ ఉద్యోగుల రాష్ట్ర స్థాయి క్రీడాపోటీలో మూడు పతకాలను కైవసం చేసుకున్న భద్రాద్రి జిల్లా అటవీశాఖ అధికారి కిష్టాగౌడ్ జాతీయ స్థాయి పోటీల్లోనూ సత్తా చాటారు. ఇటీవల ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని రాయపూర్‌లో జరిగిన 27వ ఆల్ ఇండియా ఫారెస్ట్ స్పోర్ట్స్ మీట్‌లో జిల్లా నుంచి 15మంది అటవీ ఉద్యోగులతోపాటు డీఎఫ్ఓ కిష్టాగౌడ్ వెళ్లారు. ఈమేరకు స్విమ్మింగ్ పోటీల్లో రెండు విభాగాల్లో ఆయన పతకాలు సాధించారు. అలాగే, కొత్తగూడెం డివిజన్‌కు చెందిన హారిక సైక్లింగ్, వాలీబాల్ పోటీల్లో పతకాలు దక్కించుకుంది.

సీతారామకు బ్రేక్..



అర్ధంతరంగా ఆగిన సీతమ్మ సాగర్ బ్యారేజ్ నిర్మాణ పనులు

పర్యావరణ అనుమతులు రాకపోవడంతో గోదావరిపై నిర్మిస్తున్న సీతమ్మసాగర్ పనులు 17 నెలలుగా నిలిచిపోయాయి. ప్రస్తుతం గోదావరిలో వరద తగ్గుముఖం పడుతుండగా నిర్మాణ పనులకు అనుకూల పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఈ నేపథ్యంలో సీతారామ ప్రాజెక్టుకు కేంద్రం నుంచి అన్ని రకాల అనుమతులు తీసుకురావడంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. – సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

డీపీఆర్ అనుమతుల్లో జాప్యం

- దీనిపై మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఫోకస్
- కేంద్ర జలవనరుల శాఖ పరిశీలనలో ప్రణాళిక
- అనుమతి లేక నెలలుగా ఆగిన సీతమ్మసాగర్ పనులు
- నిర్మాణానికి ఇదే అనుకూల సమయం

ఆగిన పనులు..

ఉమ్మడి ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో కొత్తగా 6.50 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించడంతో పాటు 320 మెగావాట్ల జల విద్యుత్ ఉత్పత్తి చేయాలనే లక్ష్యంతో 2016లో సీతారామ ప్రాజెక్టు పనులు చేపట్టారు. భూమిపూజ తర్వాత అనేక మలుపులు తిరిగిన ఈ ప్రాజెక్టు పనులు 'ఒక అడుగు ముందుకు.. నాలుగడుగులు వెనక్కు' అన్నట్టుగా మారాయి. పంప్‌హౌస్‌ల నిర్మాణం పూర్తయినా బ్యారేజ్ నిర్మాణానికి అనుమతులు రాలేదు. అయినప్పటికీ గత ప్రభుత్వం దుమ్ముగూడెం మండలం సున్నంబట్టి, అశ్వాపురం మండలం అమ్మగారిపల్లి గ్రామాల మధ్య సీతమ్మ సాగర్ బ్యారేజ్ నిర్మాణ పనులను 2022లో ప్రారంభించింది. శరవేగంగా పనులు జరుగుతున్న సమయంలో పర్యావరణ అనుమతులు తీసుకోకుండా, స్థానికులకు సరైన రీతిలో నష్టపరిహారం చెల్లించకుండా పనులు చేపడుతున్నారంటూ నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసులు దాఖలయ్యాయి. విచారణ చేపట్టిన ఎన్‌జీటీ సీతమ్మ సాగర్ నిర్మాణ పనులు ఉన్నపళంగా ఆపేయాలంటూ 2023 మేలో ఆదేశాలు జారీ చేసింది.

మళ్లీ ఆలస్యం..

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హామీకి తగ్గట్టుగానే వెనువెంటనే గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డులో సీతారామ అంశంపై చర్చ జరిపారు. ఆ తర్వాత టెక్నికల్ అప్రైజల్ కమిటీలోనూ వాదనలు సాగాయి. ఈ ప్రాజెక్టుకు సంబంధించి కాస్ట్ బెనిఫిట్ రేషియోపై కేంద్రం సంతృప్తి చెందిందనే వార్తలు వచ్చాయి. దీంతో త్వరలోనే సీతారామ డీపీఆర్‌కు అన్ని రకాల అనుమతులు వస్తాయనే నమ్మకం ఏర్పడింది. అయితే గత నెల రోజులుగా ఈ అంశంపై చెప్పుకోదగ్గ కదలిక లేదు. మరోవైపు డిస్ట్రిబ్యూటరీ కెనాళ్ల పనులకు సంబంధించి భూసేకరణ ప్రక్రియ మాత్రం కొనసాగుతోంది.

మంత్రుల హామీ ఏమాయె..

సీతారామ ప్రాజెక్టు పనులపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. సీతమ్మసాగర్ బ్యారేజ్‌తో పని లేకుండా సర్ అర్థర్ కాటన్ నిర్మించిన పాత ఆనకట్ట ఆధారంగా ఈ ఏడాది ఖరీఫ్‌లో కనీసం సాగర్ ఆయకట్టుకు నీరు అందించేందుకు వీలుగా పనులు చేపట్టాలని నిర్ణయించారు. ఈ క్రమంలో జూన్ 15 నుంచి ఆగస్టు 15 వరకు యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన ముగ్గురు కేబినెట్ మంత్రులకు తోడు ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి క్షేత్రస్థాయిలో అధికారులను ఉరుకులు పరుగులు పెట్టించి దగ్గరుండి మరీ పనులు జరిపించారు. మంత్రుల ఉమ్మడి కృషి ఫలించడంతో మూడు పంప్‌హౌస్‌లను సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రాబోయే రెండు నెలల్లో సీతారామ ప్రాజెక్టుకు అన్ని రకాల అనుమతులు కేంద్రం నుంచి సాధిస్తామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హామీ ఇచ్చారు. కానీ అది కార్యరూపం దాల్చలేదు.

ఇదే అనుకూల సమయం..

గత ప్రభుత్వ హయాంలో దుమ్ముగూడెం వైపు నుంచి బ్యారేజ్ పియర్స్, కట్ ఆఫ్ వాల్ తదితర నిర్మాణ పనులు జరిగాయి. గేట్ల బిగింపు ప్రక్రియ ప్రారంభించే సమయంలో కోర్టు ఉత్తర్వులతో పనులు ఆగిపోయాయి. ప్రస్తుతం గోదావరిలో వరద తగ్గుముఖం పడుతోంది. నవంబర్ చివరి నుంచి జూన్ వరకు బ్యారేజ్ నిర్మాణ పనులకు అనుకూల సమయంగా ఉంటుంది. అనుమతులు త్వరగా సాధిస్తేనే విలువైన సమయం వృథా కాకుండా నిర్మాణ సామగ్రిని పని ప్రదేశానికి తరలించడం, వర్క్‌ఫోర్స్‌ను రప్పించే అవకాశం ఉంటుంది. ఇప్పటి నుంచి అనుమతుల జారీలో ఆలస్యం జరిగిన కొద్దీ క్షేత్రస్థాయిలో పనులు పూర్తి చేయడంలో జాప్యం పెరుగుతుంది. దీని ప్రభావం ప్రాజెక్టు నిర్మాణ వ్యయంపైనా పడుతుంది. ఇప్పటికే ఈ ప్రాజెక్టుపై ఎక్కువ ఖర్చు పెట్టారనే అభిప్రాయాన్ని ప్రస్తుత ప్రభుత్వం వ్యక్తం చేస్తోంది. ఈ నేపథ్యంలో సీతారామ డీపీఆర్ అనుమతుల అంశంపై రాష్ట్ర ప్రభుత్వం మరోసారి దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

25న జిల్లాలో గవర్నర్ పర్యటన

- 24న రాత్రి సారపాకలో బస చేయనున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ
- మరుసటి రోజు రామయ్య దర్శనం, రెండు జిల్లాల్లో భేటీలు



గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

సాక్షిప్రతినిధి, ఖమ్మం/భద్రాచలం: రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ఈనెల 25న ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. ఆయన పర్యటనకు సంబంధించిన షెడ్యూల్‌ను రాజ్‌భవన్ వర్గాలు మంగళవారం విడుదల చేశాయి. సూర్యాపేట జిల్లా ఈనెల 24వ తేదీ సాయంత్రం సారపాకలోకి ఐటీసీ గెస్ట్ హౌజ్‌కు ఆయన చేరుకుంటారు. రాత్రి అక్కడే బస చేస్తారు.

25న గవర్నర్ షెడ్యూల్ ఇలా..

- ఉదయం 8.10 గంటలకు భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారిని గవర్నర్ దర్శించుకుంటారు.
- ఉదయం 9 గంటలకు కొత్తగూడెంలోని కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో సమావేశమవుతారు.
- అనంతరం 11 గంటల వరకు ఎంపిక చేసిన 25 మంది ప్రముఖ రచయితలు, కళాకారులు, జాతీయ, రాష్ట్రస్థాయి అవార్డు గ్రహీతలతో భేటీ అయి మాట్లాడారు.
- అక్కడినుంచి బయలుదేరి మధ్యాహ్నం ఒంటి గంటకు ఖమ్మంలోని ఎన్నెస్పీ గెస్ట్‌హౌస్‌కు గవర్నర్ చేరుకుంటారు.
- మధ్యాహ్నం 1.55 గంటలకు ఖమ్మం కలెక్టరేట్‌కు చేరుకుని సాయంత్రం 3గంటల వరకు జిల్లా అధికారులతో మాట్లాడతారు.
- ఆతర్వాత గంట పాటు ఎంపిక చేసిన 25మంది ప్రముఖ రచయితలు, కళాకారులు, జాతీయ, రాష్ట్రస్థాయి అవార్డు గ్రహీతలతో భేటీ అయ్యాక హైదరాబాద్ బయలుదేరతారు.

'బెస్ట్ అవైలబుల్' సేవలను వినియోగించుకోవాలి

ఐటీడీఏ డీడీ మణెమ్మ



సీట్ల భర్తీకి లాటరీ తీయిస్తున్న డీడీ తదితరులు

భద్రాచలం: భద్రాచలం ఐటీడీఏ తరఫున బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచితంగా అందజేస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని డీడీ మణెమ్మ అన్నారు. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో మిగిలి ఉన్న సీట్లకు మంగళవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో ఎంపికలు నిర్వహించారు. గిరిజన బాల, బాలికలు 75 మంది దరఖాస్తు చేసుకోగా, పిల్లల తల్లిదండ్రులు, కమిటీ సభ్యుల సమక్షంలో లాటరీ ద్వారా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా మణెమ్మ మాట్లాడుతూ.. విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలతో పాఠశాలల నిర్వహణ ఉంటుందని, ఎంపికలు పారదర్శకంగా చేపట్టామని తెలిపారు. ఆరో తరగతిలో 21 సీట్లు, ఏడో తరగతిలో ఏడు, ఎనిమిదో తరగతిలో ఎనిమిది, పదో తరగతిలో రెండు సీట్ల భర్తీకి లాటరీ ద్వారా తీసుకున్నామని వివరించారు. కార్యక్రమంలో భద్రాచలం ఎంఈఓ రమ, ఏసీఎంఓ రమణయ్య, వికాసం పాఠశాల హెచ్‌ఎం అరుణకుమారి, ఏటీడీఓలు చంద్రమోహన్, రాధమ్మ, ఏఓ ప్రమీల బాయ్ తదితరులు పాల్గొన్నారు.

అయోడిన్ లోపం రుగ్మతలపై అవగాహన

రఘునాథపాలెం: అయోడిన్‌లోపంతో ఎదురయ్యే అనారోగ్య సమస్యలు, రుగ్మతలను అరికట్టేలా పాఠశాలల్లో అవగాహన కల్పించాలని ఖమ్మం జిల్లా అసంక్రమిత వ్యాధుల నివారణ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ డి.రామారావు సూచించారు. మండలంలోని వీ.వీ.పాలెం పాఠశాలలో మంగళవారం ఏర్పాటుచేసిన సదస్సులో మాట్లాడారు. అయోడిన్ లోపం లక్షణాలు, నివారణ చర్యలను వివరించారు. జిల్లా మలేరియా అధికారి డాక్టర్ వెంకటరమణ, పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, వైద్యారోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక ర్యాంప్‌లతో ఆర్థికాభివృద్ధి సాధించాలి

ఏటీడీఏ పీఓ రాహుల్



దుమ్ముగూడెం : ఇసుక సొసైటీ మహిళలతో మాట్లాడుతున్న పీఓ రాహుల్, అధికారులు

చర్ల/దుమ్ముగూడెం : ఆదివాసీ మహిళలు సొంతంగా ఇసుక ర్యాంప్‌లు నిర్వహిస్తూ ఆర్థికాభివృద్ధి సాధించాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ అన్నారు. చర్ల మండలంలోని వీరాపురం, సి.కత్తిగూడెం, జీపీ పల్లి, ఎంపీ పల్లి, దుమ్ముగూడెం మండలం నందు లచలకలో ఇసుక ర్యాంపులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇసుక ర్యాంపుల నిర్వహణలో ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ వ్యాపారంతో మహిళలు తమ కుటుంబాలను పోషించుకోవడంతో పాటు స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఏటీడీఓ అశోక్‌కుమార్, టీఎస్‌ఎండీసీ పీఓ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

దోపిడీకి వ్యతిరేకంగా ఉద్యమించాలి

- మహిళలను అభ్యుదయ భావాల దిశగా నడిపించాలి
- సమానత్వానికి చేటు తెస్తున్న మనుధర్మం
- ఐద్వా రాష్ట్ర మహాసభల్లో జాతీయ ప్రధాన కార్యదర్శి మరియం ధావలే






ఐద్వా జెండాను ఆవిష్కరిస్తున్న మరియం ధావలే, ఇతర నాయకులు (ఇన్‌సెట్) మాట్లాడుతున్న మిడియం బాబూరావు

సింగరేణి(కొత్తగూడెం): సమాజంలో మహిళలపై జరుగుతున్న దోపిడీ, అకృత్యాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సమాఖ్య(ఐద్వా) జాతీయ ప్రధాన కార్యదర్శి మరియం ధావలే పిలుపునిచ్చారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, దానికి అనుబంధంగా ఉన్న ఆర్‌ఎస్‌ఎస్ అనుసరిస్తున్న మనుధర్మ విధానాలతో స్త్రీ, పురుష సమానత్వానికి విఘాతం కలుగుతోందని విమర్శించారు. కొత్తగూడెం క్లబ్‌లో జరుగుతున్న ఐద్వా రాష్ట్ర మహాసభల్లో మంగళవారం ఆమె మాట్లాడారు. తెలంగాణలో పరువు హత్యలు పెరగడం ఆందోళన కలిగించే అంశమన్నారు. మహిళల్లో మూఢ నమ్మకాలు పెరుగుతున్నాయని, దళిత, గిరిజన మహిళలపై దాడులు పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. మహాసభల ఆహ్వాన సంఘం గౌరవాధ్యక్షుడు మిడియం బాబూరావు మాట్లాడుతూ.. పారిశ్రామిక ప్రాంతం, గిరిజన సంస్కృతి, అభ్యుదయ భావాలకు నిలయమైన భద్రాద్రి జిల్లాలో ఐద్వా మహాసభలు జరగడం హర్షణీయమని అన్నారు. జిల్లాలో అనేక పరిశ్రమలు ఉన్నా పాలకుల వివక్ష ఫలితంగా అభివృద్ధికి నోచుకోలేదని ఆరోపించారు. భద్రాచలం నియోజకవర్గంలో కమ్యూనిస్టుల ప్రాబల్యం ఉందని, ఇక్కడ ఎమ్మెల్యేగా ఎప్పుడూ సీపీఎం అభ్యర్థులే గెలుస్తుండడంతో కుట్ర పన్నిన పాలకులు.. రాష్ట్ర విభజన సమయంలో నాలుగు మండలాలను ఏపీలో విలీనం చేశారని విమర్శించారు. పోలవరం పేరుతో వేలాది మంది ఆదివాసీలను నిలువునా ముంచేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మహాసభల్లో ఐద్వా జాతీయ నాయకులు అరుణజ్యోతి, పి.కె.శ్రీమతి, ఎస్.పుణ్యవతి, సుధా సుందర రామన్, రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి, ఉపాధ్యక్షురాలు బుగ్గవీటి సరళ తదితరులు పాల్గొన్నారు.

హాజరు అంతంతే..

- కళాశాలల్లో సౌకర్యాలు, సదుపాయాలు లేకపోవడమే ప్రధాన కారణం
- మధ్యాహ్న భోజనం కాగితాలకే పరిమితం
- ఆకలితో అలమటిస్తున్న దూర ప్రాంత ఇంటర్ విద్యార్థులు



తరగతి గదిలో విద్యార్థులు లేక ఖాళీగా కనిపిస్తున్న బెంచీలు

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలోని జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థుల హాజరు శాతం రోజురోజుకూ తగ్గిపోతోంది. కాలేజీల్లో సౌకర్యాలు, సదుపాయాలు పూర్తిస్థాయిలో లేకపోవడంతో విద్యార్థులు వచ్చేందుకు సుముఖత చూపడం లేదు. సుదూర ప్రాంతాల విద్యార్థుల హాజరు శాతం మరీ తక్కువగా ఉంటోంది. ప్రైవేట్ కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కాలేజీల్లో సదుపాయాలు కల్పిస్తే అడ్మిషన్ల పెరుగుదలతో పాటు విద్యార్థుల హాజరు శాతం కూడా పెరిగే అవకాశాలు ఉన్నాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. జిల్లాలో 14 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉండగా వాటిలో సగం కాలేజీల్లో తరగతి గదులు, ల్యాబ్‌లు శిథిలావస్థకు చేరాయి. దీనికి తోడు అధ్యాపకుల కొరత కూడా ఉండడంతో కళాశాలకు వెళ్లి చేసిదేం లేదులే అంటూ విద్యార్థులు వ్యవసాయ పనులకు వెళుతూ తల్లిదండ్రులకు ఆసరా అవుతున్నారు. ఈ పరిస్థితులను అధిగమించాల్సిన అవసరం ఉందని అధ్యాపకులు అంటున్నారు. లేదంటే ప్రభుత్వ కళాశాలల్లో అడ్మిషన్లు, హాజరు, ఉత్తీర్ణత శాతంపై ప్రభావం పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సరైన సౌకర్యాలు, సదుపాయాలు కల్పించడంతో పాటు లెక్చరర్ పోస్టులను భర్తీ చేస్తే ప్రైవేట్ కళాశాలలకు దీటుగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలు మారుతాయని అంటున్నారు.

కాగితాలకే పరిమితమైన మధ్యాహ్న భోజనం..

జిల్లాలోని 14 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మొదటి సంవత్సర విద్యార్థులు 2,254 మంది, ద్వితీయ సంవత్సర విద్యార్థులు 2,259 మంది చదువుతున్నారు. అయితే ఇందులో రోజువారీ హాజరు శాతం సగం మేర కూడా నమోదు కావడం లేదు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేసేందుకు గత ప్రభుత్వం ఆమోదం తెలిపినా అది కాగితాలకే పరిమితమైంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు చేస్తే విద్యార్థుల హాజరు శాతం పెరిగే అవకాశం ఉందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. కళాశాలలకు సుదూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆకలితో అలమటిస్తున్నారు. దీంతో కళాశాలకు రావాలంటేనే అయిష్టత వ్యక్తం చేస్తున్నారు. గతంలో ప్రభుత్వ కళాశాలలో సీటు రావాలంటే ఎన్నో పైరవీలు చేయాల్సి వచ్చేది. రాజకీయ నాయకులు, వివిధ వర్గాల వారితో సిఫార్సు చేయించుకుని సీటు పొందేవారు. ప్రస్తుతం ప్రభుత్వ కళాశాలల పరిస్థితి అందుకు పూర్తి భిన్నంగా మారింది. మళ్లీ పూర్వ వైభవం రావాలంటే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు సరిపడా అధ్యాపకులను నియమించడం, కళాశాలల్లో మౌలిక వసతులు కల్పించాల్సిన అవసరం ఉందని తల్లిదండ్రులు అంటున్నారు. స్కాలర్‌షిప్‌లు కూడా సకాలంలో అందించాలని, తద్వారా ప్రభుత్వ కాలేజీల్లో అడ్మిషన్లు, హాజరు శాతం పెరిగే అవకాశం ఉంటుందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

హాజరు పెంపునకు చర్యలు తీసుకుంటాం



జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు సుదూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు ఎక్కువగా గైర్హాజరు అవుతున్నారు. దీని నివారణకు అన్ని రకాల చర్యలు తీసుకుంటాం. కళాశాలల్లో సదుపాయాలను కల్పించేందుకు ఎప్పటికప్పుడు ప్రతిపాదనలను చేసి ఇంటర్ బోర్డుకు పంపుతున్నాం.

– వెంకటేశ్వర్లు, డీఐఈఓ

నేర పరిశోధన పారదర్శకంగా చేయాలి

- పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేయండి
- సమీక్ష సమావేశంలో ఎస్పీ రోహిత్‌రాజ్



పోలీసు జాగిలం, హ్యాండ్లర్‌ను అభినందిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెంరూరల్ : ప్రతి కేసులో సమగ్ర దర్యాప్తు చేపట్టి పారదర్శకంగా నేర పరిశోధన నిర్వహించాలని, నేరస్తులకు శిక్ష పడేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని ఎస్పీ రోహిత్‌రాజ్ పోలీస్ అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా పోలీస్‌స్టేషన్ల వారీగా పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలు, వాటి పురోగతి గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. న్యాయాధికారులతో సమన్వయం పాటిస్తూ పెండింగ్ కేసులను సత్వర పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. సరికొత్త టెక్నాలజీతో సైబర్ నేరగాళ్లు అమాయక ప్రజల ఖాతాల నుంచి నగదు మాయం చేస్తున్నారని, సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పిస్తూ అప్రమత్తం చేయాలని అన్నారు. దొంగతనం కేసుల్లో చోరీ సొత్తు రికవరీ చేసి బాధితులకు న్యాయం చేయాలని చెప్పారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలను రవాణా చేసేవారితో పాటు సేవించే వారిపై కూడా కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని ఆదేశించారు. గుట్కా, మట్కా, జూదం, బెట్టింగ్ వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, చట్ట ప్రకారం కేసులు నమోదు చేయాలని చెప్పారు. రౌడీషీటర్లు, పాత నేరస్తుల కదలికలపై ఎప్పటికప్పుడు నిఘా పెంచాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని అన్నారు. అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో రోడ్డు ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాలను గుర్తించి సంబంధిత అధికారులతో సమన్వయం పాటిస్తూ నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో పనిచేసే అధికారులు అప్రమత్తంగా ఉండాలని, వారి కదలికలపై నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోలీస్ డ్యూటీ మీట్‌లో కాంస్య పతకం సాధించిన చంద్రుగొండ ఎస్‌ఐ స్వప్నను అభినంధించారు. సమావేశంలో డీఎస్పీలు చంద్రభాను, సతీష్‌కుమార్, రవీందర్‌రెడ్డి, డీసీఆర్బీ డీఎస్పీ మల్లయ్య స్వామి, ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్, నాగరాజు, ఏఓ జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ జాగిలానికి బంగారు పతకం

కొత్తగూడెంటౌన్: హైదరాబాద్‌లో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి పోలీస్ డ్యూటీ మీట్ పోటీల్లో బంగారు పతకం సాధించిన పోలీసు జాగిలం జూనోను ఎస్పీ రోహిత్ రాజు మంగళవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూనో ఎక్స్‌ప్లోజివ్స్ కనిపెట్టే విభాగంలో పతకం సాధించిందని చెప్పారు. ఈ విభాగంలో రాష్ట్ర వ్యాప్తంగా 21 పోలీసు జాగిలాలు పాల్గొనగా జిల్లాకు చెందిన జూనో బంగారు పతకం, రివార్డు గెలుచుకుందని తెలిపారు. జూనో తోపాటు హ్యాండ్లర్ హుస్సేన్‌ను ఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ సత్యనారాయణ, అడ్మిన్ ఆర్ఐ లాల్ బాబు, ఆర్ఎస్ఐ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మునగసాగుతో అధిక లాభాలు



మాట్లాడుతున్న ఏడీఏ రవికుమార్

చంద్రుగొండ: మునగ, వెదురు సేద్యంతో అధిక లాభాలు పొందవచ్చని అశ్వారావుపేట వ్యవసాయ శాఖ డివిజన్ సహాయ సంచాలకులు పి.రవికుమార్ రైతులకు సూచించారు. చంద్రుగొండలోని రైతువేదికలో మంగళవారం రైతులకు అవగాహన కల్పించారు. ఉపాధి పథకం ద్వారా మునగ సేద్యం చేసే రైతులకు రాయితీలు అందించనున్నట్లు తెలిపారు. రబీ సీజన్‌లో మొక్కజొన్న సేద్యం (ఆడ, మగ) పేరిట విత్తనాలు ఇచ్చేందుకు వస్తే వెంటనే వ్యవసాయ శాఖాధికారులకు ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఏఓ వినయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం కబ్జాపై విచారణ



విచారణ చేస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

అశ్వారావుపేటరూరల్: మండలంలోని వినాయకపురం గ్రామంలో ప్రధాన రహదారి పక్కనే ఉన్న విలువైన గ్రామ పంచాయతీ స్థలాన్ని కబ్జా చేసి, అక్రమంగా భవన నిర్మాణం చేస్తున్న ఘటనపై మంగళవారం అధికారులు విచారణ నిర్వహించారు. ఈ వ్యవహారంపై 'సాక్షి'దినపత్రికలో 'దర్జాగా ప్రభుత్వ స్థలం కబ్జా'శీర్షికన ప్రచురితమైన కథనంతో స్థానిక ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ క్షేత్రస్థాయికి వెళ్లి విచారణ చేపట్టారు. ప్రభుత్వ స్థలంగా గుర్తించి, కబ్జా చేసిన వ్యక్తికి మరోసారి నోటీస్ జారీ చేయాలని పంచాయతీ కార్యదర్శి సాయిని ఆదేశించారు. నిర్మాణాన్ని నిలిపి వేయాలని, నిర్మాణ పనులు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీఓ సోయం ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆదివాసీలను విడుదల చేయాలి

- మానవ హక్కుల సంఘం డిమాండ్

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో పోలీసులు అక్రమంగా అదుపులోకి తీసుకున్న ఆదివాసీలను వెంటనే విడుదల చేయాలని మానవహక్కుల సంఘం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, ఎస్.నారాయణరావు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. బీజాపూర్ జిల్లాలోని టేకుమెట్ల గ్రామాన్ని మంగళవారం తెల్లవారుజామున చుట్టుముట్టిన పోలీసులు సాధారణ పౌరులైన సోడి మహీంద్ర, సోడి రాజ్‌కుమార్, బార్సె దేవా, కుంజం ఉర్రులను బలవంతంగా తీసుకెళ్లారని పేర్కొన్నారు. ఈ క్రమంలో ప్రశ్నించిన మహిళలు, గ్రామస్తులపై బెదిరింపులకు పాల్పడ్డార ని ఆరోపించారు. ఆదివాసీలకు పోలీసుల నుంచి ప్రాణహాని ఉన్నందున తక్షణమే విడుదల చేయాల ని లక్ష్మణ్, నారాయణరావు డిమాండ్ చేశారు.

బస్టాండ్లలో షాపుల కేటాయింపునకు టెండర్లు

ఖమ్మంమయూరిసెంటర్/సత్తుపల్లిటౌన్: ఖమ్మం రీజియన్‌లో ఆర్టీసీ బస్టాండ్లలోని షాపులను అద్దెకు కేటాయించేలా టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు డిప్యూటీ ఆర్‌ఎం జీ.ఎస్.పవిత్ర తెలిపారు. ఖమ్మం, మధిర, సత్తుపల్లి, భద్రాచలం, కొత్తగూడెం, మణుగూరు, ఇల్లెందు డిపోల పరిధిలోని బస్టాండ్లలో షాపుల కోసం ఆసక్తి ఉన్న వారు నవంబర్ 6వ తేదీలోపు ఆర్టీసీ వెబ్‌సైట్‌లో టెండర్లు దాఖలు చేయాలని సూచించారు. పూర్తి వివరాలకోసం కోసం 99635 07506 నంబర్‌లో సంప్రదించాలని ఓ ప్రకటనలో వెల్లడించారు. కాగా, సత్తుపల్లి ఆర్టీసీ డిపో పరిధిలోని అశ్వారావుపేట, వీఎం బంజర బస్టాండ్లలోని నాలుగు చొప్పున షాపులకు నేరుగా దరఖాస్తులు స్వీకరిస్తామని డీఎం యు.రాజ్యలక్ష్మి మరో ప్రకటనలో తెలిపారు.

అకాల వర్షంతో రైతులకు నష్టం..



నేలమట్టమైన వరి పైరు

అశ్వాపురం: మండలంలోని మొండికుంట ప్రాంతంలో సోమవారం రాత్రి కురిసిన అకాల భారీ వర్షానికి వరి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. కోత దశలో వరి పొలాలు నేలవాలడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆగస్టులో వచ్చిన భారీ వర్షానికి తీవ్రంగా నష్టపోయామని మిగిలిన పంటను రైతులు కంటికి రెప్పలా కాపాడుకోగా ధాన్యం చేతికి వచ్చే సమయంలో వరి పైరు నేలమట్టం కావడంతో లబోదిబోమంటున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.


పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.17,043

వరుస చోరీలతో బెంబేలు

- శివారు ప్రాంతాలు, ఆలయాల్లో హుండీలే లక్ష్యం
- 13న ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసిన దుండగులు
- కంటిమీద కునుకు లేకుండా గడుపుతున్న ప్రజలు



మున్సిపాలిటీ పరిధిలోని స్టోర్స్ గ్రౌండ్ వద్ద శ్మశానవాటికలో కాపర్ వైరు చోరీ చేసి పడేసిన ట్రాన్స్‌ఫార్మర్

మణుగూరుటౌన్: మణుగూరులో వరుస దొంగతనాలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ముఖ్య కూడళ్లు, కాలనీలు, దుకాణాలు, ఇళ్లు, ఆలయాలు, ఇలా వీలైన చోట్ల నిఘా ఉంటోంది. పైపెచ్చు పోలీసుల పెట్రోలింగ్ జరుగుతోంది. అయినా దొంగలు భయపడటం లేదు. ఇటీవల పట్టణ శివారు ప్రాంతాల్లో జరిగిన ఘటనలే అందుకు నిదర్శనం. ఏమాత్రం బెరుకు లేకుండా తాళాలను పగలగొట్టి లోపలికి చొరబడి అవలీలగా చేతివాటం ప్రదర్శిస్తూ దర్జాగా వెళ్లిపోతున్నారు. శివారు ప్రాంతాల్లో తాళాలు వేసిన నివాసాలు, ఆలయాల్లో హుండీలపై దృష్టి సారిస్తూ అమ్మవారి వెండికళ్లు సైతం దోచేస్తున్నారు. శివారు ప్రాంతాల్లో నిర్జీవ ప్రదేశాల్లోని ఇళ్లల్లో పట్టపగలే దొంగతనాలకు పాల్పడుతూ ప్రజలకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నారు. కొత్తగూడెం – ఏటూరునాగారం ప్రధాన రహదారి కావడంతో ఇతర ప్రాంతాల నుంచి వస్తూ శివారు ప్రదేశాల్లో ఉండే ఆలయాలు, దుకాణాలు, శ్మశానవాటికలు అనే తేడా లేకుండా అన్ని చోట్లా చోరీలకు పాల్పడుతున్నారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దొంగతనాలు ఒకే రోజు రెండు చోట్ల జరుగుతుండటం మణుగూరు కేంద్రంగా దొంగల సంచారం ఎక్కువ కావడం కలవరపెడుతోంది.

అదును చూసి దొంగతనాలు..

పట్టణంలో కూడళ్ల వద్ద సీసీ కెమెరాలు, నిత్యం పోలీసుల తనిఖీలు, పెట్రోలింగ్ వంటి ప్రత్యేక చర్యల నేపథ్యంలో శివారు ప్రాంతాల్లో దొంగలు రెక్కీ నిర్వహించి అదును చూసి చేతివాటం ప్రదర్శిస్తున్నారు. పలుచోట్ల సీసీ కెమెరాల్లో అక్కడక్కడా యువకులే దర్శనమిస్తుండటంతో గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు యువకులు బానిసలై చోరీలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

కొన్ని ఘటనలు..

- ఆగస్టులో శేషగిరినగర్‌కు చెందిన ఓ వ్యక్తి బ్యాటరీలు దొంగిలించగా, దేహశుద్ధి చేసి డ్రైవర్లు, ఓనర్లు పోలీసులకు అప్పగించారు.
- ఆగస్టు రెండో వారంలో పీవీకాలనీలోని ఏరియా ఆస్పత్రి ఆవరణలో ఉండే అమ్మవారి ఆలయంలో సమీపంలో సెక్యూరిటీ కాపలా ఉండగానే రాత్రి వేళ హుండీ పగులగొట్టి కానుకలు దోచేశారు.
- ఈ నెల 9వ తేదీన వాగు మల్లారంలో దొంగతనానికి వచ్చి తాళం వేసి ఉన్న ఇంటి తలుపులు పగలగొట్టి చోరీకి యత్నించే క్రమంలో గ్రామస్తులను చూసి పరారయ్యాడు.
- ఈ నెల 14న లారీ కాంటా వద్ద ఉన్న కనకదుర్గ ఆలయంలో గుర్తు తెలియని దుండగులు చొరబడి హుండీ తాళాలు పగలగొట్టి రూ.25 వేల విలువైన కానుకలు, నగదు చోరీ చేశారు. ఈ ఘటనపై కేసు నమోదైంది.
- ఈ నెల 15న రాత్రి శేషగిరినగర్‌లోని అభయాంజనేయ స్వామి ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు హుండీలోని నగదు కానుకలను అపహరించారు. ఈ ఘటనపై కూడా కేసు నమోదైంది.
- ఈ నెల 13న రాత్రి మణుగూరు మున్సిపాలిటీ శివారులోని మణుగూరు స్టోర్స్ మైదానం వద్ద వైకుంఠధామంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించి అందులోని కాపర్ వైరు చోరీ చేశారు. శివారు ప్రాంతం కావడంతో అక్కడి నుంచి నివాసాలకు విద్యుత్ కనెక్షన్ లేకపోవడంతో పాటు అధికారుల పర్యవేక్షణ లోపంతో ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం చేసి, కాపర్ వైరు చోరీ చేశారు. దాదాపు పదిహేను రోజుల అనంతరం మంగళవారం అధికారులు పోలీసులను సంప్రదించినట్లు తెలుస్తోంది.
- సోమవారం రాత్రి సమితిసింగారం పంచాయతీకి కూతవేటు దూరంలో రోడ్డుకు దగ్గరలో ఉండే ముత్యాలమ్మ వారి దేవాలయంలో అర్ధరాత్రి వెండి కళ్లు, వెండి ఆభరణాలు, ఆలయ సామగ్రి చోరీ చేశారు.

కాగా, చోరీలు జరుగుతున్నా ఆస్తి నష్టం భారీగా లేకపోవడంతో కొందరు బాధితులు పోలీసులను సంప్రదించడం లేదు. దీంతో మండలంలో పలు చోట్ల జరుగుతున్న దొంగతనాలు పోలీసుల దృష్టికి వెళ్లడం లేదని తెలుస్తోంది. అయితే వరుస దొంగతనాలు చేస్తూ మణుగూరు ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న చోరులపై ఉక్కుపాదం మోపాలని ప్రజలు కోరుతున్నారు.

రెస్క్యూ టీంకు మొదటి బహుమతి



రెస్క్యూ టీమ్‌ను అభినందిస్తున్న జీఎం శాలేంరాజు

సింగరేణి(కొత్తగూడెం): రామగుండంలో ఈ నెల 16, 17వ తేదీల్లో జరిగిన జోనల్‌స్థాయి రెస్క్యూ పోటీల్లో కొత్తగూడెం రీజియన్ టీమ్ బెస్ట్ ఫ్రెష్ ఎయిర్‌బేస్ విభాగంలో మొదటి బహుమతి సాధించింది. ఈ సందర్భంగా బృందం సభ్యులను కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శాలేంరాజు మంగళవారం అభినందించి మాట్లాడారు. రెస్క్యూ టీమ్‌ను మరింత బలోపేతం చేస్తూ, ఎక్కడ ఆపద ఎదురైనా ఆదుకునేలా సిద్ధంగా ఉండాలని తెలిపారు. ఎస్‌ఓటూ జీఎం కోటిరెడ్డి, ఏఎస్‌ఓ వెంకటేశ్వరరావు, రెస్క్యూ ఇన్‌చార్జ్ అనంతరామయ్యతో పాటు మనోహర్, అనిల్‌రెడ్డి, బాసు ప్రసాద్, శ్రీకాంత్, వెంకటేశ్వర్లు, వరప్రసాద్, రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు పిల్లల అప్పగింత



తల్లిదండ్రులతో మాట్లాడుతున్న స్వర్ణలత లెనీనా

భద్రాచలంఅర్బన్: భిక్షాటన చేస్తున్న కొందరు చిన్నారులను సోమవారం భద్రాచలంలోని శిశుగృహానికి తరలించగా.. మంగళవారం వారి తల్లిదండ్రులకు అప్పగించారు. కలెక్టర్ జితేశ్ వి పాటిల్ ఆదేశాల మేరకు భద్రాచలం పట్టణంతో పాటు పాల్వంచలో సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జిల్లా బాలల సంరక్షణ, చైల్డ్ హెల్ప్‌లైన్ విభాగాల అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించి 16 మంది చిన్నారులు భిక్షాటన చేస్తుండగా గుర్తించి.. వారిని భద్రాచలంలోని శిశుగృహానికి తరలించిన విషయం విదితమే. కాగా, చిన్నారుల తల్లిదండ్రులు మరోసారి చిన్నారులను వెంటబెట్టుకుని భిక్షాటన చేయబోమని జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారుల వద్ద మొరపెట్టుకున్నారు. దీంతో తల్లిదండ్రులకు చట్టాలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించి, ధ్రువపత్రాలపై సంతకాలు చేయించి స్త్రీ సంక్షేమ శాఖ అధికారి స్వర్ణలతా లేనినా ఆధ్వర్యంలో చిన్నారులను తల్లిదండ్రులకు అప్పగించారు. కార్యక్రమంలో శిశుగృహ మేనేజర్ చంటిబాబు పాల్గొన్నారు.

తనయుడి మరణాన్ని తట్టుకోలేక ఆగిన తల్లి గుండె

- ఇద్దరినీ కబళించిన గుండెపోటు
- ఒకరోజు వ్యవధిలో ఇద్దరి హఠాన్మరణం
- ఇల్లెందులో తీవ్ర విషాదం



నరేందర్(ఫైల్)



కుటుంబసభ్యులతో సులోచన(ఫైల్)

ఇల్లెందు: కుమారుడి మరణాన్ని తట్టుకోలేని తల్లి గుండెపోటుతో మృతిచెందిన ఘటన ఇల్లెందులో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. పట్టణంలోని సీతారామ టాకీస్ ప్రాంతానికి చెందిన పసుపులేటి నరేందర్(60) గుండెపోటుతో సోమవారం మృతిచెందాడు. నరేందర్ చిన్న సోదరుడు కృష్ణ విశాఖపట్టణంలో ఉంటుండగా, తల్లి పసుపులేటి సులోచన(82) కూడా అక్కడే ఉంది. నరేందర్ మరణవార్త తెలియగానే ఇద్దరూ ఇల్లెందుకు చేరుకున్నారు. నరేందర్ మృతదేహాన్ని చూసి సులోచన తల్లడిల్లిపోయింది. మంగళవారం నరేందర్ దహన సంస్కారాలకు ఏర్పాట్లు చేస్తుండగా.. అతడి నుదుటిపై చేయిపెట్టి ఆమె తీవ్రంగా రోదిస్తుండగా గుండెపోటుకు గురై కుమారుడి మృతదేహంపైనే పడిపోయింది. వెంటనే కుటుంబసభ్యులు సీపీఆర్ చేసిన అనంతరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఒకరోజు వ్యవధిలోనే తల్లీకుమారుల మృతితో ఆ ఇంట్లో తీవ్ర విషాదం నెలకొంది. కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటుతున్నాయి. నరేందర్ అంత్యక్రియలు మంగళవారం నిర్వహించగా.. సులోచన అంతిమ సంస్కారాలు బుధవారం చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

చోరీ కేసులో నలుగురి అరెస్ట్..



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రెహమాన్

చుంచుపల్లి: కొత్తగూడెం – విద్యానగర్‌కాలనీ ఆర్కే సూపర్ మార్కెట్ ఎదుట ఈ నెల 9న జరిగిన బంగారు ఆభరణాల చోరీ కేసులో నలుగురు దొంగలను పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ వివరాలు వెల్లడించారు. కొత్తగూడెం రైటర్‌బస్తీకి చెందిన రిటైర్డ్ ఉద్యోగి బొడ్డపాటి వెంకటేశ్వరరావు ఈ నెల 9న పోస్ట్ ఆఫీస్ సెంటర్ ఎస్‌బీఐ లాకర్‌లో ఉన్న 19 తులాల తన భార్య బంగారు ఆభరణాలను తీసుకొని కారులో విద్యానగర్ కాలనీ ఆర్కే సూపర్ మార్కెట్‌కు వద్దకు వచ్చారు. అక్కడ సరుకులు కొనుగోలు చేసి తన కారు డిక్కీలో పెట్టే క్రమంలో అదే సమయంలో వెంకటేశ్వరరావును మొదటి నుంచి గమనిస్తూ వెనకే ఆటోలో వచ్చిన అనిశెట్టిపల్లికి చెందిన నిందితుడు తంబళ్ల నితీశ్ చాకచక్యంగా ముందు సీటులో ఉన్న బంగారు ఆభరణాల బ్యాగును చోరీ చేశాడు. అక్కడి నుంచి ములుగు జిల్లా గొల్లవాడకు చెందిన నిమ్మల వినయ్‌కుమార్, లోతువాగుకు చెందిన గుంజి వీరబాబు, కొత్తగూడెం బూడిదగడ్డకు చెందిన మహమ్మద్ నహీం సహకారంతో అదే ఆటోలో పరారయ్యాడు. చోరీ చేసిన బంగారు ఆభరణాల విలువ రూ.4.75 లక్షలు ఉంటుందని డీఎస్పీ తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సీసీఎస్ సీఐ రమాకాంత్, చుంచుపల్లి సీఐ రాయల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో రంగంలోకి దిగిన సీసీఎస్ ఎస్ఐ ప్రవీణ్, పోలీస్ సిబ్బంది సీసీ ఫుటేజీల ఆధారంగా అతి తక్కువ సమయంలో నిందితులను పట్టుకున్నామని ఆయన చెప్పారు. వారి నుంచి 33 గ్రాముల బంగారం, రూ.9,600 నగదు, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు.


25న ఎమ్మెల్సీ కోదండరాం పర్యటన



మాట్లాడుతున్న శంకరరావు

దుమ్ముగూడెం: భద్రాచలంలో ఈ నెల 25వ తేదీన తెలంగాణ జన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం పర్యటించనున్నారని టీజేఎస్ ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్‌చార్జ్ గోపగాని శంకరరావు తెలిపారు. మండలంలోని లక్ష్మీనగరం గ్రామంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 24న భద్రాచలంలో టీజేఎస్ నాయకులు, కార్యకర్తలతో కోదండరాం సమావేశమవుతారని, 25న శ్రీ సీతారామచంద్ర స్వామివారిని దర్శించుకుంటారని తెలిపారు. ఈ మేరకు పార్టీ శ్రేణులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కాగా, ఏజెన్సీ ప్రాంతంలో కొందరు వ్యక్తులు గిరిజనుల హక్కులను కాలరాస్తూ భూయాజమాన్య హక్కు పత్రాలు పొందుతున్నారని, ఈ విషయంలో అధికారులు స్పందించకపోతే ఆందోళనలు చేపడుతామని తెలిపారు. సమావేశంలో నాయకులు పూనెం ప్రదీప్‌కుమార్, రేపాక రామారావు తదితరులు పాల్గొన్నారు.

45 లీటర్ల నాటుసారా స్వాధీనం



నాటుసారా, నిందితుడిని చూపుతున్న అధికారులు

బూర్గంపాడు: ఆంధ్రప్రదేశ్‌లోని గుండువారిగూడెం నుంచి సారపాక, గాంధీనగర్, ఒడియా క్యాంపులకు ఆటోపై, మోటార్ సైకిల్‌పై నాటుసారా రవాణా చేస్తున్న ఏడుగురు వ్యక్తులను ఎక్సైజ్‌శాఖ అధికారులు పట్టుకున్నారు. ఎక్సైజ్ సీఐ సుంకర రమేశ్ కథనం ప్రకారం.. ఏపీ నుంచి సారపాకకు నాటుసారా రవాణా చేస్తున్నారనే సమాచారంతో మంగళవారం తెల్లవారుజామున సారపాక బ్రిడ్జి వద్ద ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది నిఘా పెట్టారు. ఒక ఆటోలో, మోటార్ సైకిల్‌పై రవాణా చేస్తున్న 45 లీటర్ల నాటుసారాను ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. దాడుల్లో కన్నాయిగూడెం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ పదం రాజేశ్, గుండువారిగూడెంనకు చెందిన భూక్యా సక్కు, భూక్యా శ్రీరామ్, సున్నం వీరభద్రం, సారపాకకు చెందిన మూడు శ్రీను, లావుడ్యా సాలిని అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు. సీఐ సుంకర రమేశ్, హెడ్‌కానిస్టేబుల్ కరీం, బాలు, కానిస్టేబుళ్లు సుధీర్, వెంకట్, హరీశ్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

టేకు దుంగలు స్వాధీనం



వాగులో దాచిన టేకు దుంగలను బయటకు తీస్తున్న సిబ్బంది

దుమ్ముగూడెం: మండలంలోని గౌరారం గ్రామ సమీపంలోని గుబ్బలమంగి వాగులో అక్రమంగా దాచి ఉంచిన 9 టేకు దుంగలను రేంజర్ కమల ఆధ్వర్యంలో సిబ్బంది మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. పర్ణశాల సెక్షన్ పరిధిలోని లింగాపురం బీట్‌లో గల గుబ్బలమంగి వాగులో కొంత మంది టేకు కలపను దాచి ఉంచారని అటవీశాఖ అధికారులకు సమాచారం అందింది. దీంతో అటవీశాఖ సిబ్బంది గుబ్బలమంగి వాగులో తనిఖీలు చేపట్టగా అందులో దాచిన 9 టేకు దుంగలను స్వాధీనం చేసుకుని భద్రాచలం అటవీశాఖ కార్యాలయానికి తరలించారు. స్వాధీనం చేసుకున్న కలప విలువ సుమారు రూ.70 వేల వరకు ఉంటుందని అధికారులు తెలిపారు.

చెల్లని చెక్కు ఇచ్చిన కేసులో జైలుశిక్ష

ఖమ్మంలీగల్: తీసుకున్న అప్పు తీర్చే క్రమాన ఇచ్చిన చెక్కు చెల్లకపోవడంతో సదరు వ్యక్తికి ఆరు నెలల జైలుశిక్షతోపాటు నష్టపరిహారం కింద ఫిర్యాదికి రూ.3 లక్షలు చెల్లించాలని ఖమ్మం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి కోర్టు న్యాయాధికారి కాసరగడ్డ దీప మంగళవారం తీర్పు చెప్పారు. కేసు వివరాలిలా ఉన్నాయి. ఖమ్మం ఎస్పీ ఆఫీస్ రోడ్డు ప్రాంతానికి చెందిన పాగా బాబులు వద్ద రాపర్తినగర్‌కు చెందిన బ్రహ్మదేవర సోమయ్య 2018 జూన్ 22న రూ.2.90 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. అనంతరం నగదు చెల్లించాలని బాబులు సూచించగా 2019 డిసెంబర్ 21న రూ.2.50 లక్షలకు చెక్కు ఇచ్చాడు. అయితే, ఈ చెక్కును బ్యాంక్ ఖాతాలో జమ చేస్తే సోమయ్య ఖాతాలో సరిపడా నగదు లేక తిరస్కరణకు గురైంది. దీంతో బాబులు తన న్యాయవాది ద్వారా లీగల్ నోటీస్ జారీ చేసి కోర్టులో ప్రైవేట్ కేసు దాఖలు చేశాడు. ఈమేరకు విచారణ అనంతరం సోమయ్యకు జైలుశిక్ష విధించడంతో పాటు రూ.3లక్షలు చెల్లించాలని న్యాయాధికారి తీర్పు చెప్పారు.

మహిళా ఉద్యోగులపై వేధింపులు?


పాల్వంచ: పాల్వంచలోని జెన్‌కో ట్రైనింగ్ సెంటర్‌లో విధులు నిర్వహించే మహిళా ఉద్యోగులను ఓ అధికారి వేధింపులకు గురి చేస్తున్నట్లు కాంప్లెక్స్‌లో ప్రచారం జరుగుతోంది. ఈ విషయంపై ఇప్పటికే సదరు మహిళా ఉద్యోగులు ఎస్సీ, ఎస్టీ, బీసీ సంఘాలతో పాటు, విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. దీంతో విజిలెన్స్ అధికారులు ఆరా తీస్తుండగా, మరో వైపు సదరు సంఘాల నేతలు మహిళా సిబ్బంది వేధింపుల విషయంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు విశ్వసనీయ సమాచారం. కాగా సదరు అధికారి మాట వినని మహిళా ఉద్యోగితో పాటు మరో ఉద్యోగిని సైతం సెంట్రల్ ఆఫీస్‌కు సీఈ చేయాల్సిన బదిలీ ఆర్డర్‌ను స్వయంగా తానే చేయడం దుమారం రేపుతోంది. అయితే, మహిళా ఉద్యోగుల విషయంలో సదరు అధికారి వ్యవహరిస్తున్న తీరుపై పలు కార్మిక, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంఘాల నేతలు గుర్రుగా ఉన్నారు. కాగా, ట్రైనింగ్ సెంటర్ సీఈ శ్రీనివాసబాబును వివరణ కోరేందుకు ఫోన్‌లో ప్రయత్నించగా స్పందించలేదు.

నెల్లిపాక పోస్టాఫీస్‌లో విచారణ

అశ్వాపురం: మండల పరిధిలోని నెల్లిపాక బంజర గ్రామంలోని పోస్టాఫీస్‌లో ఖాతాదారుల డబ్బు స్వాహాపై తపాలా శాఖ అధికారులు మంగళవారం విచారణ చేపట్టారు. ఖాతాదారుల డబ్బు పోస్టుమాస్టర్ వారి ఖాతాల్లో జమ చేయకుండా స్వాహా చేయడంతో పలువురు రూ.10 వేల నుంచి లక్షల రూపాయల మేర నష్టపోయారు. పోస్టాఫీస్‌లో 200 ఖాతాలు ఉండగా ఎంత మంది ఖాతాదారులు ఎంత డబ్బు నష్టపోయారనేది స్పష్టంగా తెలవాల్సి ఉంది.

పిడుగుపాటుతో తండ్రీకుమార్తె మృతి

- మృతుడి భార్యకు తీవ్రగాయాలు
- పత్తి చేనులో పనికి వెళ్లిన సమయాన ఘటన



లింగస్వామి (ఫైల్)



కావేరి (ఫైల్)

కామేపల్లి: పత్తి ఏరేందుకు వెళ్లిన తండ్రీకుమార్తె పిడుగుపాటుతో మృతి చెందగా మృతుడి భార్య తీవ్ర అస్వస్థతకు గురైంది. కామేపల్లి మండలం మద్దులపల్లిలో మంగళవారం ఈ ప్రమాదం జరిగింది. మద్దులపల్లికి చెందిన చింతల లింగస్వామి (38)– శైలజ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. పెద్దకుమార్తె కావేరి(19) కారేపల్లిలోని ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతూ హాస్టల్‌లో ఉంటోంది. దసరా సెలవులకు ఇంటికి వచ్చిన ఆమె ఇంకా వెళ్లలేదు. ఈక్రమంలో తమ చేనులో పత్తి ఏరేందుకు తల్లిదండ్రులతో కలిసి కావేరి వెళ్లింది. మంగళవారం మధ్యాహ్నం వర్షం కురుస్తుండగా అందరూ చేను సమీపాన చెట్టు కిందకు చేరారు. ఈక్రమంలోనే వర్షం పెరిగి చెట్టుపై పిడుగుపడటంతో షాక్‌కు గురైన లింగస్వామి, కావేరి అక్కడికక్కడే మృతి చెందగా శైలజకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో సహచర రైతులు, కూలీలు ఆమెను ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయం తెలిసిన రెవెన్యూ, పోలీసు అధికారులు చేరుకుని దర్యాప్తు చేపట్టారు. కాగా, దసరా సెలవులకు ఇంటికి వచ్చిన కావేరి తల్లిదండ్రులకు సాయంగా వెళ్లి మృత్యువాత పడడం, ఆమె తండ్రి కూడా మృతి చెందడంతో కుటుంబంలో విషాదం నెలకొంది.

ఫోన్ ధరతో పాటు పరిహారం, ఖర్చులు చెల్లించండి

ఖమ్మం లీగల్: అమెజాన్‌లో ఫోన్ ధర చెల్లించి బుక్ చేసుకుంటే డెలివరీ చేయకపోగా సరైన సమాధానం రాకపోవడంతో ఓ వ్యక్తి చేసిన ఫిర్యాదు మేరకు ఆయనకు అనుకూలంగా ఖమ్మం జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ చైర్మన్ వి.లలిత, సభ్యురాలు ఏ.మాధవీలత తీర్పు ఇచ్చారు. ఖమ్మంకు చెందిన జి.కృష్ణారెడ్డి 28 మార్చి 2023న రూ.29,999 చెల్లించి అమెజాన్‌లో ఫోన్ బుక్ చేసుకున్నాడు. ఆయనకు 5 ఏప్రిల్ 2023న ఫోన్ డెలివరీ చేసినట్లు మెసేజ్ అందినా ఫోన్ చేరలేదు. ఈ విషయమై సంస్థకు ఫోన్ చేసినా స్పందన రాకపోవడంతో ఆయన వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్‌ను ఆశ్రయించారు. దీంతో విచారణ అనంతరం ఫోన్ నగదు రూ.29,999తో పాటు నష్టపరిహారంగా రూ.10వేలు, కోర్టు ఖర్చుల నిమిత్తం మరో రూ.10వేలు చెల్లించాలని మంగళవారం తీర్పు చెప్పారు.